ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
సోమవారం 26 ఫిబ్రవరి 2024



7 నుంచి లేపాక్షిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

లేపాక్షి, ఫిబ్రవరి 25: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శిల్పకళాక్షేత్రం లేపాక్షిలో మార్చి 7వ తేదీ నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం వెల్లడించింది. ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం సమావేశమై, ఈ మేరకు తీర్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందం మాట్లాడుతూ.. మార్చి 7 నుంచి 11వ తేదీ వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడతామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు సైతం ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పురంలో రియల్ వ్యాపారం ఢమాల్

రియల్టర్ల వలసబాట

హిందూపురం, ఫిబ్రవరి 23: టీడీపీ హయాంలో రియల్టర్ల చేతినిండా డబ్బే. ఎక్కడ చూసినా ఆస్తుల క్రయవిక్రయాలు, హాట్‌కేకుల్లా సాగేవి. హిందూపురం అంటే చెప్పనవసరం లేదు. కొనేవారు, అమ్మేవారితో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కిటకిటలాడేది. రిజిస్ట్రేషన్ పెట్టాలంటేనే మూడు, నాలుగు రోజులు వేచి చూడాల్సి వచ్చేది. ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా మారింది. అమ్మకందారులున్నారుకానీ కొనుగోలుదారులు ఎక్కడ అనే ప్రశ్న రియల్టర్లలో మొదలైంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలతోపాటు రియల్ వ్యాపారం తల్లకిందులైంది. ఒకప్పుడు రియల్టర్‌ను రూ.10లక్షలు అడిగితే టక్కున భూములకు అడ్వాన్స్ ఇచ్చేవాడు. ప్రస్తుతం అదే రియల్టర్‌ను రూ.10వేలు అడిగినా ఇచ్చేందుకు ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో కర్ణాటకకు రియల్టర్లు వలస వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. దీనంతటికీ ప్రస్తుతం రాష్ట్రాన్ని పాలిస్తున్న వైసీపీయే కారణమని సీఎం జగన్ సామాజికవర్గానికి చెందిన రియల్టర్లే వాపోతుండడం గమనార్హం.

- వైసీపీ దెబ్బకు కుదేలైన భూవ్యాపారాలు
- ఎన్నికల వేళ మరింత తగ్గిన దుస్థితి
- సొమ్మంతా ఆస్తులపైనే..
- తగ్గిన నగదు చలామణి
- అమ్మేవారు సరే.. కొనేవారెక్కడ?
- లేఔట్లు వేయడానికి జంకుతున్న వైనం
- పక్క రాష్ట్రాలకు వలస

హిందూపురానికి చెందిన ఓ రియల్టర్ 2014-2019 మధ్యకాలంలో పలుచోట్ల లేఔట్లు వేసి, హాట్‌కేకుల్లా అమ్మేశారు. ఆయన అప్పట్లో పట్టణానికి దూరంగా లేఔట్లు వేసినా అమ్ముడుపోయేవి. అప్పట్లో రూ.50 లక్షలన్నా లెక్కలేదు. అర్ధరాత్రిలో భూమి ఉందని చెబితే అలాగే రూ.లక్షల్లో అడ్వాన్స్ ఇచ్చేవారు. ప్రస్తుతం అదే రియల్టర్ వద్దకెళ్లి ఇబ్బంది ఉందనీ, నచ్చిన ధరకు ప్లాట్లు ఉన్నాయనీ చెప్పినా రూ.10వేలు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొంది.

హిందూపురం రూరల్ మండలానికి చెందిన చిన్నచిన్న ప్లాట్లు అమ్మించే మధ్యవర్తి టీడీపీ హయాంలో ఒకరి ప్లాట్లు మరొకరికి ఇప్పించి తద్వారా వచ్చే కమీషన్లతో పట్టణంలో సుమారు రూ.50లక్షలు చెల్లించి, ఇల్లు నిర్మించుకున్నారు. పిల్లలను విజయవాడలో చదివించడానికి చేర్చారు. ప్రస్తుతం ప్లాట్ల విక్రయాలు లేక అప్పట్లో కట్టుకున్న ఇంటిని బ్యాంకులో తాకట్టు పెట్టి, పిల్లల చదువు ఫీజులకు ఇబ్బందిపడే పరిస్థితి వచ్చింది. ఈ ముగ్గురే కాదు, పురంలో రియల్ వ్యాపారం చేసే వారితోపాటు మధ్యవర్తులది, వారిని నమ్ముకున్న వారి పరిస్థితి కూడా దయనీయం.

పురానికి చెందిన మరో రియల్టర్ టీడీపీ హయాంలో 50 ఎకరాల పొలం ఉందన్నా రెండు రోజుల్లో నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకునేవారు. సొమ్ము ఎంత అని అడిగేవారు కాదు. 50ఎకరాల వరకు భూములను పదుల సంఖ్యలో కొనుగోలుచేసి, విక్రయాలు సాగించేవారు. అదే రియల్టర్ నేడు ఎకరా భూమి ఉందనీ, అనుకూలమైన ధరకే ఇస్తామన్నా.. వద్దంటూ చేతులెత్తేసే దుస్థితి దాపురించింది.



వ్యాపారం ఢమాల్

ఒకప్పుడు స్థలంకానీ, భూమికానీ విక్రయిస్తామంటే కొనడానికి క్యూలో ఉండేవారు. ప్రస్తుతం పరిస్థితి మారింది. 2018లో హిందూపురం పట్టణ పరిధిలో ఓ రియల్టర్ సెంటు రూ.10లక్షలు చొప్పున విక్రయించాడు. అప్పట్లో 2018లో వందప్లాట్లు లేఔట్ వేయగా.. 70 విక్రయించాడు. మరో 30ప్లాట్లు అలాగే పెట్టుకున్నాడు. అవికూడా రహదారి పక్కన ఉంచుకున్నాడు. ప్రభు త్వం మారితే రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింత చురుగ్గా ఉంటుందని భావించాడు. ఆ తరువాత నాలుగైదు ప్లాట్లు మాత్రం అదే ధరకు విక్రయించాడు. మరో 25 ప్లాట్లు అలాగే ఉన్నాయి. వాటిని విక్రయించడానికి ఎంత ప్రయత్నించినా కొనేవారు లేరు. దీంలో సెంటు 6 నుంచి 7 లక్షలకే విక్రయిస్తానని చెప్పినా కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. మరో రియల్టర్ లేపాక్షి మండలంలో 30 ఎకరాలు కొనుగోలు చేశాడు. అప్పట్లో రూ.22 లక్షలతో కొన్నాడు. ప్రస్తుతం అదేధరకే ఇస్తానని చెబుతున్నా కొనడానికి ఎవరూ ముందుకు రావట్లేదు.

సొమ్మంతా ఆస్తులపైనే..



కోట్లాది రూపాయలు వెచ్చించి భూములు కొనుగోలు చేసే వ్యాపారులు సైతం ఉన్న సొమ్మును భూములపై పెట్టేశారు. వాటిని అమ్ముదామంటే కొనేవారులేరు. రియల్టర్లు బజారుకు రావడమే మానేశారంటే పరిస్థితి ఏరకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉన్న సొమ్మంతా ఆస్తులపై పెట్టారు. మరికొంతమంది వడ్డీకి తెచ్చి భూములపై వేశారు. దీంతో వడ్డీకి తెచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వలేక, మరికొంతమంది వడ్డీ చెల్లించడం చేతగాక, ఉన్న ఆస్తులు కొనేవారు లేక నానా అవస్థలు పడుతున్నారు. టీడీపీ హయాంలో విపరీతంగా ఉన్న నగదు చలామణి వైసీపీ అధికారంలోకి వచ్చాక స్తంభించిపోయింది. ఐదేళ్ల క్రితం ఏ బ్యాంకులోకెళ్లినా నగదు చలామణి బాగా సాగేది. ప్రస్తుతం కొన్ని బ్యాంకుల అధికారులు ఫైనాన్స్ కంపెనీలకు ఫోన్‌చేసి నగదును డిపాజిట్ చేయండని కోరుతున్నట్లు సమాచారం. దీనినిబట్టి నగదు లావాదేవీలు ఏమేర తగ్గాయో అర్థం చేసుకోవచ్చు.

ఐదేళ్లుగా రియల్ వ్యాపారం పడిపోయింది. ఎన్నికల వేళయినా పుంజుకుంటుందని వ్యాపారులు ఆశించారు. అందుకు విరుద్ధంగా ప్రస్తుతం మరింత పడిపోతోందని రియల్టర్లు వాపోతున్నారు. ప్రభుత్వం మారినా వచ్చే జనవరి వరకు భూవ్యాపారులు ఇలాగే ఉండవచ్చని భావిస్తున్నారు. మరోసారి వైసీపీ వస్తే భూ వ్యాపారమే ఉండదని అందినకాడికి అమ్ముకుని ఊళ్లు వదలాల్సిన పరిస్థితి వస్తుందని రియల్ వ్యాపారులు పేర్కొంటుండడం శోచనీయం.

ఎన్నికల వేళ మరింత తగ్గిన వ్యాపారం

రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా పడిపోవడంతో పట్టణం, మండలంలో లేఔట్లు వేయడానికి జంకే పరిస్థితి నెలకొంది. చాలామంది లేఔట్లు వేయడానికి భూములు కొనుగోలు చేసి, అలాగే ఉండిపోయారు. ఈ పరిస్థితి హిందూపురంలో అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే లేఔట్లు వేసేవారే కనుమరుగయ్యే పరిస్థితి వస్తుందని రియల్ వ్యాపారులు బహిరంగంగా చెప్పుకుంటున్నారు. ఇక్కడ వ్యాపారాలు లేక పక్కరాష్ట్రాలకు తరలి వెళ్తున్నారు. హిందూపురంలో రియల్ వ్యాపారం చేసేవారు వంద మందికిపైగా ఉండగా.. 20మంది పెద్ద రియల్టర్లు కర్ణాటకకు తరలి వెళ్లారు. దీనిని బట్టి హిందూపురం ప్రాంతంలో రియల్ రంగం వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎంతలా పడిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

పురం ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్

నిర్మాణానికి వర్చువల్‌గా ప్రధాని మోదీ శ్రీకారం



ఆస్పత్రిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 25: స్థానిక జిల్లా ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి వర్చువల్‌గా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన యూనిట్ నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా మెడికల్ కళాశాలలు, క్రిటికల్ కేర్ యూనిట్ల పనులకు వర్చువల్‌గా మోదీ ప్రారంభించారు. అందులో భాగంగా పురం ఆస్పత్రిలో రూ.23 కోట్లతో తలపెట్టిన క్రిటికల్ కేర్ యూనిట్‌కు శ్రీకారం చుట్టారు. హిందూపురం ఆస్పత్రిలో కలెక్టర్ అరుణ్ బాబు, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్.. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ తిప్పేంద్రనాయక్, జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్, ఆర్ఎంఓ రుక్మిణమ్మ, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



వర్చువల్‌గా ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

1224 మంది గైర్హాజరు

కొత్తచెరువు, ఫిబ్రవరి 25: జిల్లాలో గ్రూప్-2 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా సాగింది. మొత్తం 8,0239 మంది దరఖాస్తు చేసుకోగా.. పరీక్షకు 7,015 మంది హాజరయ్యారు. 1224 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 28 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. కేంద్రాలను జిల్లా అధికారులు తనిఖీ చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష కొనసాగింది. ఉదయం 9 గంటలకల్లా అభ్యర్థులు కేంద్రాల వద్దకు చేరుకున్నారు.



పురంలోని ఎంజీఎం పాఠశాల కేంద్రం వద్ద అభ్యర్థుల సందడి

నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరనే నిబంధన ఉండటంతో ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పటిష్ట బందోబస్తు నడుమ పరీక్షలు కొనసాగాయి. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పలు పరీక్షాకేంద్రాలను పరిశీలించారు.

నాది ఒకే పార్టీ.. ఒకే జెండా..

పార్టీ ఫిరాయించే ప్రశ్నే లేదు..
టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి

పెనుకొండ, ఫిబ్రవరి 25: 'టీడీపీ నాకు రాజకీయ భిక్ష పెట్టిన పార్టీ. ఊపిరి ఉన్నంతకాలం టీడీపీలోనే కొనసాగుతా. పార్టీ ఫిరాయిస్తున్నానన్న వదంతులు నమ్మకండి. పార్టీ కార్యకర్తకు ఏ కష్టమొచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటాన'ని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులతో బీకే పార్థసారథి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ.. పార్టీ అధినేత చంద్రబాబు పిలుపు మేరకు విజయవాడ వెళ్తున్నానన్నారు. టిక్కెట్ నిరాకరణకు కారణాలను అడిగి తెలుసుకుంటానన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయం పాటించాలని సూచించారు. సమావేశంలో నాయకులు మునిమడుగు వెంకటరాముడు, కేశవయ్య, జీవీపీ నాయుడు, రొద్దం నరసింహులు, సుబ్బరత్నమ్మ, ఐదు మండలాల కన్వీనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి



ఎంపిక కేక..!

టీడీపీ తొలి జాబితాపై శ్రేణుల హర్షం
గెలుపు గుర్రాలనే బరిలోకి దింపారంటూ ఉత్సాహం


పుట్టపర్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు దగ్గర పడుతున్నాయి.. అభ్యర్థుల ప్రకటన ఎప్పుడెప్పుడా అంటూ తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎదురుచూశాయి. ఆ సమయం రానేవచ్చింది. ఈనెల 24న టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థుల తొలి జాబితాను ఆయా పార్టీల అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ప్రకటించారు. హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో నలుగురు అభ్యర్థులను ప్రకటించారు. ఈ ఎంపిక పట్ల పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గెలుపు గుర్రాలనే టీడీపీ బరిలోకి దింపిందని పేర్కొంటున్నారు. హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలున్నాయి. తొలి విడతలో నాలుగు శాసనసభ స్థానాలకు ఉమ్మడి టీడీపీ-జనసేన జట్టు అభ్యర్థుల ప్రకటనతో ఎన్నికల బరి సిద్ధమైంది. గెలుపు గుర్రాలను బరిలో దించాలన్న వ్యూహం పాటించారన్న చర్చ సాగుతోంది. అనుభవం, ప్రజాదరణ, సామాజిక సమీకరణాలు, యువ నాయకత్వం కలగలిసి అనేక వడపోతలు, సర్వేలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులను ఖరారు చేసినట్లు స్పష్టమవుతోంది. హిందూపురం, పెనుకొండ, రాప్తాడు, మడకశిర నియోజకవర్గాలకు అభ్యర్థుల ప్రకటనతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. అధికార పార్టీకి దీటుగా సీనియర్లు, బలమైన అభ్యర్థులకు తొలి జాబితాలో చోటు కల్పించారు.

బాలయ్య హ్యాట్రిక్‌కు సిద్ధం




హిందూపురంలో నందమూరి బాలకృష్ణ మూడోసారి బరిలో దిగుతుండగా ఈసారి తెలుగుదేశం పార్టీ ఇక్కడ 11వ సారి విజయం సాధించబోతోందని తెలుగు తమ్ముళ్లు ఉవ్విళ్లూరుతున్నారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి హిందూపురం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా నిలుస్తా వస్తోంది. ప్రతిపక్ష పార్టీ తరఫున ముఖ్యమంత్రులు ప్రచారం చేసినా.. ఆ పార్టీ నేతలు ఇక్కడే మకాం వేసినా, ఆఖరికి ప్రజల తీర్పు మాత్రం సైకిల్‌కే. ఈసారి కూడా తెలుగుదేశం పార్టీ తరఫున బరిలో నిలవనున్న నందమూరి బాలకృష్ణకు గత రెండు పర్యాయాల కన్నా.. ఈసారి అధిక మెజార్టీ వస్తుందని టీడీపీ నాయకులు దీమా వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, వైసీపీ నాయకులు చేస్తున్న అరాచకాలు, ఆగడాలు, దందాలు, దౌర్జన్యాలు చూసి ప్రజలు విసిగి వేసారిపోయారు. హిందూపురం ప్రజలు కోరుకునేది ఒక్కటే ఇక్కడ గెలిచే అభ్యర్థి దౌర్జన్యాలు, దందాలు, చేయకూడదని. వ్యాపారాలు చేసుకునే వారికి టచ్ చేయరాదని ఆశిస్తారు. మరికొన్ని వర్గాలైతే హిందూపురం ప్రశాంతంగా ఉండాలంటే టీడీపీ అభ్యర్థి గెలవాలని కోరుకుంటారు. దీంతో ఇతర పార్టీలు ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పినా హిందూపురం ప్రజల ఆలోచన మాత్రం తెలుగుదేశం వైపే ఉంటుంది. దీనికితోడు 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ఇప్పటికీ ప్రజలు చర్చించుకుంటుంటారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో చేసిందేంటి? ఆఖరికి గత ప్రభుత్వంలో ప్రారంభించిన పనులు కూడా పూర్తి చేయకపోవడంతో హిందూపురం ప్రజలు అధికార పార్టీపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఇవన్నీ టీడీపీకి కలిసి వచ్చే అంశాలుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రాప్తాడులో పరిటాల సునీత



జిల్లా రాజకీయాల్లో చరగని ముద్ర వేసిన పరిటాల రవీంద్ర హత్య అనంతర పరిణామాలతో రాజకీయాల్లోకి వచ్చిన పరిటాల సునీత 2005లో పెనుకొండ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. నియోజక వర్గాల పునర్విభజన నేపథ్యంలో రాప్తాడు నియోజకవర్గానికి మారారు. 2009, 2014లో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపొంది, మంత్రిగా పనిచేశారు. జిల్లా పునర్విభజన తరువాత రాప్తాడు అనంత జిల్లాలోకి వెళ్లినా హిందూపురం పార్లమెంటు పరిధిలోనే ఉంది. ఇదే నియోజక వర్గం నుంచి పరిటాల సునీత బరిలో దిగుతున్న నేపథ్యంలో రాప్తాడుతోపాటు హిందూపురం పార్లమెంటు నియోజక వర్గంపై పరిటాల కుటుంబ ప్రభావం చూపుతుంది.

పెనుకొండలో ఫైర్‌బ్రాండ్



పెనుకొండలో ఎమ్మెల్యే శంకర్ నారాయణపై వ్యతిరేకతతో వైసీపీకి అభ్యర్థి దొరక్క, కళ్యాణదుర్గం నుంచి మంత్రి ఉషశ్రీచరణ్‌ను తీసుకొచ్చారన్న వాదనలున్నాయి. పెనుకొండ టీడీపీ అభ్యర్థిగా ఫైర్‌బ్రాండ్‌గా పేరున్న సవితను నియమించడంతో అక్కడ కూడా తెలుగు తమ్ముళ్లలో జోష్ నెలకొంది. ఆమె తండ్రి మంత్రిగా, ఎంపీగా పెనుకొండకు సేవలందించారు. సవిత కూడా కొన్నేళ్లుగా సేవాకార్యక్రమాలు చేపడుతూ ప్రజల మధ్యనే ఉంటున్నారు.

మడకశిరలో ఉన్నత విద్యావంతుడు



ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం మడకశిర నుంచి ఉన్నత విద్యావంతుడు, యువకుడు వైద్యుడు సునీల్‌కుమార్‌ను టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిపారు. ఆయన మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు కావడంతో పార్టీ క్యాడర్‌తోపాటు జనంలోకి దూసుకెళ్లే పరిస్థితి ఉంది. ఈరన్న 2009 నుంచి వరుసగా టీడీపీ నుంచి మూడుసార్లు పోటీ చేసి.. 2014 ఎన్నికల్లో గెలిచారు. తండ్రి ఈరన్న అనుభవంతోపాటు మడకశిరలో టీడీపీ బలమైన క్యాడర్ సునీల్‌కుమార్‌కు కలిసిరానుంది.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

పుట్టపర్తి, ఫిబ్రవరి 25: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మండల, గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమం ఉంటుందనీ, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సిద్ధం అంటూ.. మీడియాపై యుద్ధం

● ప్రశ్నించే గొంతులను నొక్కే పనిలో ప్రభుత్వం ● రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు ● జర్నలిస్టులపై దాడి.. ప్రజాస్వామ్యానికి ప్రమాదం ● 'అక్షరం, కలంపై దాడి.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం' చర్చావేదికలో వక్తలు


చర్చావేదికలో ఐక్యత చాటుతున్న నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 25: రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధం... సిద్ధం అంటూ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై ఒక యుద్ధం చేశాడని పలు రాజకీయ, కుల, ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, మేధావి వర్గం నాయకులు మండిపడ్డారు. విధి నిర్వహణలో భాగంగా రాప్తాడు సిద్ధం సభకు వెళ్లిన శ్రీకృష్ణపై అమానుషంగా దాడి చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టి వేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీకృష్ణపై జరిగిన దాడికి నిరసనగా ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఫర్ ద సొసైటీ వ్యవస్థాపకుడు పోతుల రాధాకృష్ణ ఆధ్వర్యంలో 'అక్షరం మరియు కలంపై దాడి - ప్రమాదంలో ప్రజాస్వామ్యం' అనే అంశంపై చర్చావేదికను ఏర్పాటు చేశారు. ఈ చర్చావేదికలో పలు రాజకీయ, కుల, ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ఈ చర్చా వేదికలో ప్రొఫెసర్ సదా శివారెడ్డి, రాప్తాడు నియోజకవర్గ టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు నారాయణస్వామి, బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిడుగు శ్రీనివాసులు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జిలాన్, పీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు సిరాజ్, ముస్తఫా, కుమార్‌రాజా, ఎన్జీఓ నగర ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌బాబు, టీడీపీ అధికార ప్రతినిధి నారాయణస్వామి యాదవ్, బీసీ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి జైపాల్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు సురేష్ యాదవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, సీపీఐ నాయకులు రమణయ్య, కాంగ్రెస్ నాయకులు శంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వం వ్యక్తి నిర్మూలన కోరుకుంటోంది : పోతుల రాధాకృష్ణ, ఫర్ ద సొసైటీ వ్యవస్థాపకుడు



రాష్ట్రంలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రం జర్నలిస్టులు, ప్రశ్నించే గొంతుకలు, మేధావులను నక్స లైట్లు, తీవ్రవాదులుగా పరిగణించి కేసులు పెడుతుంటే... రాష్ట్ర ప్రభుత్వం సమాజాన్ని చంపుతూ... వ్యక్తి ని ర్మూలన కోరుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాలపై దాడులు, బెదిరింపులు అధిక మయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంపై ఒత్తిడి తెస్తున్నాయి. జర్నలిస్టులపై దాడులకు తెగబడుతూ... భావప్రకటన స్వేచ్ఛను అణచివేయాలని చూడటం దుర్మార్గమైన చర్య. శ్రీకృష్ణపై జరిగిన దాడి అమానుషం. రాష్ట్రవ్యాప్తంగా ఆ దాడిపై చర్చ జరుగుతున్నా... పాలకులు నోరు మెదపకపోవడం దారుణం. రాష్ట్రంలో ఎమర్జెన్సీ ఉందేమోనన్న భయం వేస్తోంది.

ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది : అయూఫ్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధానకార్యదర్శి



రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగుతోంది. ప్రభు త్వం ప్రశ్నించే వారి గొంతు నొక్కడమే పనిగా పెట్టుకుంది. శ్రీకృష్ణ మీద అమానుషంగా దాడి చేయడం ఎంతో బాధాకరం. ప్రభుత్వానికి మీడియా మీద ఎంత కసి ఉందో శ్రీకృష్ణపై జరిగిన దాడి అద్దం పడుతోంది. జర్నలిస్టులకు రక్షణగా చట్టాలు తీసుకురావాలి.

మేధావుల మౌనంతోనే ఈ పరిస్థితులు..: రాజారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు



రాష్ట్రంలో మేధావులు మౌనం వహించడంతోనే నియంతృత్వ పరిస్థితులు ఏర్పడ్డాయి. సీఎం జగన్ సిద్ధం... సిద్ధం అంటుంటే ఎన్నికలకు సిద్ధమవుతున్నాడని అనుకున్నాం. కానీ కలంపై కత్తి దూయడానికి సిద్ధం అని అనుకోలేదు. ఉద్యమాలు చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు. దానిని అణచాలని చూస్తే ఎలా...? జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియంతృత్వ పోకడలకు పో తున్నారు. ప్రజాస్వామ్యంను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను అడ్డు పెట్టుకుంటోంది.

కలం లేకుండా భవిష్యత్తు లేదు: రమణారెడ్డి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



కలం లేకుంటే భవిష్యత్తు లేదు. రాష్ట్ర ప్రభుత్వం అసంబద్ధమైన విధానాలను అవలంభిస్తోంది. ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతోంది. ఉపాధ్యాయ, ఉద్యోగులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని చలో విజయవాడకు పిలుపునిస్తే స్కూళ్లో ఉన్నా, ఊర్లో ఉన్నా, ఎక్కడున్నా నోటీసులు ఇస్తున్నారు. మీరు వెళ్లకూడదు. వెళ్తే క్రమశిక్షణ చర్యలు ఉంటాయని బెదిరిస్తున్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలపై ఒత్తిళ్లు పెరిగిపోయాయి.

మానవత్వం మంటగలిసేలా కొట్టారు: వెంకటేష్, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి మానవత్వం మంటకలిసేలా ఉంది. శ్రీకృష్ణకి రాజకీయ పార్టీలకు ఏంటి సంబంధం..? ఇదేనా ప్రజాస్వామ్యమంటే..? ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉరవకొండ, కళ్యాణదుర్గంలో మా సమస్యలపై మాట్లాడుకునేందుకు కలిస్తే... సీఐలు, ఎస్ఐలు వచ్చి ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. సీఎంను కలిసి రెప్రజెంటేషన్ ఇద్దామనుకుంటే మాపై బైండోవర్ కేసులు పెడుతున్నారు. సీఎం జగన్ సిద్ధం.. సిద్ధం అంటున్నారు. నిన్ను ఇంటికి పంపేందుకు మేమూ కూడా సిద్ధంగా ఉన్నాం.

అంతు చూస్తామన్న రీతిలో సీఎం జగన్ ప్రవర్తన: శంకర్, ఎంఈఎఫ్ జాతీయ అదనపు కార్యదర్శి



రాష్ట్రంలో ఎవరైనా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే నీ అంతు చూ స్తామన్న రీతిలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రవర్తిస్తున్నాడు. శ్రీకృష్ణపై దాడి ఎంతో బాధ కలిగించింది. ఎంతో మంచి వ్యక్తి. పొట్టకూటి కోసం విధులు నిర్వహిస్తున్న శ్రీకృష్ణలాంటి వ్యక్తులపై దాడి చేయడం అమానుషం. శ్రీకృష్ణపై జరిగిన దాడి బయటికి వచ్చిందికానీ... చాలాచోట్ల దాడులు బయటికి రావడం లేదు. మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరిగాయి. రాజశేఖర్‌రెడ్డి కొడుకు... మంచి చేస్తాడని సీఎంను చేస్తే మాపైనే దాడులు చేయిస్తున్నాడు. ఇలాంటి వ్యక్తిని వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది.

సమాజానికి దిక్సూచి మీడియా: నాగేంద్ర యాదవ్, జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా అధ్యక్షుడు



సమాజానికి దిక్సూచి మీడియా. అలాంటి మీడియాపై దాడులు చేయడమంటే భావ ప్రకటన స్వేచ్ఛను దెబ్బ తీయడమే. రాజకీయ నాయ కుల చేతుల్లోకి మీడియా పోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. కొందరి వల్ల దాడులు అధికమయ్యాయి. వ్యవస్థకు తూట్లు పొడుస్తూ.. రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారు. శ్రీకృష్ణపై జరిగిన దాడి.. భవిష్యత్తులో మరెవరిపై జరగకుండా ప్రభుత్వాలు రక్షణ చట్టాలు తీసుకురావాలి.

పాలకులు దౌర్జన్యాలు ఆపాలి : చంద్రమోహన్, ఏపీఎన్జీఓ జిల్లా ప్రధానకార్యదర్శి



పాలకులు దౌర్జన్యాలు, దాడులు ఆపాలి. శ్రీకృష్ణపై దాడి అమానుషం. పత్రికా స్వేచ్ఛకు ఎవరూ భంగం కలిగించకూడదు. దాడులు చేయడం బాధాకరం. దాడులు, దౌర్జన్యాలకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. భవిష్యత్తులో జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలి.

ప్రశ్నించే గొంతులు మూసుకుపోయే ప్రమాదం ఉంది: పుట్టా శ్రీధర్, బీసీ,ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి బాధాకరం. అంతమంది వచ్చి ఒక వ్యక్తిని కొడుతుంటే ప్రజాస్వామ్యం ఉందా అన్న సందేహం కలుగుతోంది. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపులపై పాలకులు స్పందించకపోవడంతోనే దాడులు అధికమవుతున్నాయి. ఏం మాట్లాడాలన్నా.. ఎవరొస్తారో... ఏ సమస్య వస్తుందోనన్న భయానకర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రశ్నించే గొంతుకలు మూసుకుపోయే ప్రమాదం ఉంది.

మీడియాపై గుత్తాధిపత్యం కోసం పోరాటం: బండి నాగరాజు, అనంత విద్యావంతులు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు



రాష్ట్రంలో మీడియాపై గుత్తాధిపత్యం కోసం పోరాటం జరుగుతోంది. ప్రభుత్వం భయంతో జర్నలిస్టులను అణచివేయాలని చూస్తోంది. ప్రస్తుతం దేశంలో జర్నలిస్టుల స్వేచ్ఛ 170 స్థానంలో ఉంది. శ్రీకృష్ణపై జరిగిన దాడి సమాజం తలదించుకునేలా ఉంది. ప్రశ్నించే గొంతుకను నొక్కడమంటే ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసినట్లే. దీనిని ప్రతిఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలి.

నేడు కాంగ్రెస్ న్యాయ సాధన శంఖారావం సభ

● హాజరుకానున్న ఏఐసీసీ, పీసీసీ చీఫ్‌లు ● సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభం..

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 25: జిల్లా కేంద్రంలోని కొత్తూరు జూనియర్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ పార్టీ న్యాయసాధన శంఖారావం సభను సోమవారం నిర్వహించనుంది. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు, పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, పార్టీ ప్రముఖ నాయకులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున జన సమీకరణ చేసి సభ విజయవంతం చేయడానికి స్థానిక నాయకులు ఎవరి పరిధిలో వారు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి జన సమీకరణ కోసం పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, శైలజానాథ్, గిడుగు రుద్రరాజుతో పాటు జంగా గౌతమ్ ప్రయత్నిస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, రాష్ట్రమైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీ, ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌తో పాటు ఎన్ఎస్‌యూఐ నాయకులు పెద్ద ఎత్తున జన సమీకరణకు చర్యలు చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు సభ ప్రారంభం కానుంది. రాష్ట్ర విభజనతో ఉనికి కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ అస్తిత్వం కోసం తీవ్ర ప్రయత్నం చేస్తోంది. ఈక్రమంలోనే జిల్లా నుంచి ఎన్నికల శంఖారావాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పూరించనున్నారు. ఈ సభతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మరో 4 ఎన్నికల సభలు నిర్వహించేలా నాయకులు శ్రీకారం చుట్టారు. ఈ సభలకు పార్టీ అధికారంలో ఉన్న పొరుగు రాష్ట్రాల నుంచి ముఖ్య మంత్రులను, ఇతర నాయకులను పిలిపించి స్థానిక నాయకులు, కార్యకర్తల్లో ఉత్తేజం నింపే చర్యలకు పూనుకున్నారు. అనంతపురం సభ సక్సెస్‌పైనే ఇతర సభల నిర్వహణ ఆధారపడే అవకాశం ఉందన్న చర్చలు సాగుతున్నాయి.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు..

శ్రమదోపిడీ



● పారిశుధ్య కార్మికుల కడుపుకొడుతున్న కాంట్రాక్టర్ ● ఆర్టీసీ బస్టాండులో నిబంధనలు పాటించని వైనం ● చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం



అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 25: ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం బస్టాండులో పనిచేసే పారిశుధ్య కార్మికుల (స్వీపర్ల)కు తక్కువ వేతనాలు ఇస్తూ కాంట్రాక్టరు వారు కడుపుకొడుతున్నాడు. ఆర్టీసీ నిబంధనల మేరకు వారికి వేతనాలు ఇవ్వకుండా తన జేబును నింపుకుంటున్నాడు. దీన్ని పర్యవేక్షించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. 2022లో ప్రొద్దుటూరుకు చెందిన గంగరాజు అనే వ్యక్తి పారిశుధ్య కార్మికులచే బస్టాండులో పనులు చేయించే కాంట్రాక్టు దక్కించుకున్నాడు. అనంతపురం బస్టాండుకు మొత్తం 15 మంది కార్మికులను కేటాయించగా ఒక్కో కార్మికుడికి రూ.12వేలు చొప్పున ఆర్టీసీ వేతనం అంది స్తోంది. ఇందులో ఈఎస్ఐ, పీఎఫ్‌కు రూ.1500లు పోగా రూ.10,500 ఉంటుంది. ఆర్టీసీ నిబంధనల మేరకు ఈ రూ.10,500 కార్మికులకు చెల్లించాల్సింది. అయితే ఏజెన్సీ తరఫున కార్మికులను సరఫరా చేస్తున్నందున ఆ కాంట్రాక్టరు ఒక్కో కార్మికుడిపై రూ.500 కమీషన్ తీసుకున్నా రూ.10వేలు చొప్పున అయినా చెల్లించాలి. అయితే రూ. మూడు వేలు చొప్పున కమీషన్ తీసుకుంటూ రూ.7500లు మాత్రమే కార్మికులకు వేతనాలుగా చెల్లిస్తూ, వారి కడుపు కొడుతున్నాడు. దీనిపై కార్మికులు ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. అనంతపురం డిపో పరిధిలోనే డిపో గ్యారేజీకి ఒక కాంట్రాక్టరు, ఆర్ఎం కార్యాలయానికి మరొక కాంట్రాక్టరు కార్మికులను సరఫరా చేసి వారికి ఒక్కొక్కరికి రూ.9500లు చొప్పు న వేతనాలు ఇస్తున్నారు. అయితే ఇదే డిపో ఆవరణలోనే ఉన్న బస్టాండుకు సంబంధించి కాం ట్రాక్టు దక్కించుకున్న గంగరాజు మాత్రం కార్మికుల వేతనంలో రూ.3వేలు కోత పెట్టి తన జేబు నింపుకుంటుండటం గమనార్హం.

జీతాలు వేసినట్లే వేసి వెనక్కు...

వేతనాల కోత విషయంపై కార్మికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో గతంలో అధికారులు కాంట్రాక్టరును హెచ్చరించారు. దీంతో గత 5 నెలల నుంచి కార్మికుల ఖాతాల్లోకి రూ.9500లు చొప్పున వేతనాలు జమ చేయడం, కార్మికులందరినీ బ్యాంకుకు తీసుకెళ్లి ఖాతాల్లో నగదు డ్రా చేయించి, అందులో రూ.7500లు మాత్రమే వారి చేతికిచ్చి, మిగిలిన సొమ్ము తానే తీసుకెళ్లిపోతు న్నాడు. ఇదేంటని కార్మికులు ప్రశ్నిస్తే మిమ్మల్ని పనిలోనుంచి తొలగిస్తానంటూ బెదిరిస్తున్నాడని పలువురు కార్మికులు వాపోతున్నారు.

కుటుంబ పోషణ కష్టంగా ఉంది: లక్ష్మీదేవి



మా ఇంట్లో అనారోగ్యంతో బాధపడుతున్న అత్త ఉంది. సాధారణం గానే రూ.7500లతో కుటుంబ పోషణ కష్టం. దీనికి తోడు పిల్లల చదువులు, మా అత్త ఆరోగ్యంకోసం వైద్య ఖర్చు లు వీటన్నింటి నడుమ జీవనం కష్టతరంగా మారింది. అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తోంది. ఆర్టీసీ నిబంధనల మేరకు వేతనాలిస్తే ఇన్ని కష్టాలుండవు.

విచారణ చేపడతాం: నాగభూపాల్, అనంతపురం డిపో మేనేజర్



కార్మికుల వేతనాల నుంచి కాంట్రాక్టరు డబ్బు తీసుకుంటున్న విషయం మా దృష్టికి వచ్చింది. మీరు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదని కార్మికులకు సూచించాం. జీతాల సమస్య, కాంట్రాక్టరు తీరుపై విచారణ చేపట్టి, తగు చర్యలు తీసుకుంటాం.

మమ్మల్ని తొలగించి బిహార్ వాళ్లతో పని చేయిస్తానంటున్నారు..: రామాంజనేయులు



మా కష్టానికి తగ్గ వేతనం ఇవ్వాలని కాంట్రాక్టరును అనేకసార్లు కోరాం. ఆర్టీసీ అధికారులు తెలిపిన మేరకు వేతనాలివ్వమని అడిగితే మిమ్మల్ని పనిలోనుంచి తొలగించి, బిహార్ కార్మికులతో పనిచేయిస్తా అంటూ కాంట్రాక్టరు బెదిరిస్తున్నాడు. నిరుపేద కార్మికులైన మా కష్టాన్ని కాంట్రాక్టరుతోపాటు ఆర్టీసీ అధికారులు గుర్తించాలి.

'చలో విజయవాడ' వాయిదా సహించం


మాట్లాడుతున్న నరసింహులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 25: చలో విజయవాడ వాయిదా నిర్ణయం సరికాదని, దీన్ని సహించేది లేదని, ఏపీ జేఏసీ నిర్ణయాన్ని మూకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నామని ఏపీటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం ఉపాధ్యాయభవన్‌లో ఆ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల పక్షాన సమస్యల పరిష్కారానికి నాయకత్వం వహిస్తున్న ఏపీ జేఏసీ అర్ధంతరంగా ఈ నెల 27న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేయడాన్ని ఏపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఏపీ జేఏసీ నాయకులు ఒక అ జెండా, చిత్తశుద్ధి లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. రెండుసార్లు చర్చలు జరిగి.... ఉన్నఫలంగా వాయిదా పేరుతో వెనక్కు తగ్గడం దారుణం అన్నారు. జిల్లా అధక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరి మారాలన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులతో, జేఏసీ నాయకులతో పూటకో మాట చెబితే చూస్తూ ఊరుకోమన్నారు. తక్షణమే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కలసి వచ్చే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చలో విజయవాడపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సతీష్, రామకృష్ణ, బాల రామ్మోహన్, రవికుమార్, వన్నప్ప, పుల్లయ్య, సర్ధార్ వలి, చిదంబరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

భార్యను హత్యచేసిన భర్త


హరిలత మృతదేహం

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి25: స్థానిక జయనగర్‌కాలనీలో రామాంజనేయులు తన భార్య హరిలత (38) అలియాస్ అరుణ తలపై ఆదివారం రోకలిబండతో మోది హత్యచేశాడని పట్టణ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. పుట్లూరు మండలం గరుగుచింతలపల్లికి చెందిన రామాంజనేయులు, హరిలత.. ఇద్దరు పిల్లలతో కలిసి ఉపాధి కోసం తాడిపత్రికి వలస వచ్చారు. జయనగర్‌కాలనీలో నివాసం ఉండేవారు. రామాంజనేయులు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా రామాంజనేయులు మద్యానికి బానిసయ్యాడు. దీంతో పలుచోట్ల అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిళ్ల అధికం కావడంతో స్వగ్రామంలో ఉన్న మూడెకరాల భూమిని విక్రయించాడు. వచ్చిన డబ్బుతో అప్పులుతీర్చాడు. మిగిలిన డబ్బుతో జల్సా చేస్తుండటంతో భార్య మందలించింది. భార్యాభర్తల మధ్య మాటా మాటా పెరిగింది. కోపోద్రిక్తుడైన రామాంజనేయులు ఇంటిలోని రోకలి బండతో భార్య తలపై మోదాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ఇంటర్ చదివే కుమారుడు ఫణీంద్ర, 8వ తరగతి చదివే కుమార్తె మానస ఉన్నారు. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుప్పకూలిన రథం

రథోత్సవంలో అపశ్రుతి.. అందరూ సురక్షితం..


రథాన్ని లాగుతున్న భక్తులు

కుందుర్పి, ఫిబ్రవరి 25: మండలంలోని అపిలేపల్లిలో బొబ్బిళ్లకుంట ఆంజనేయ స్వామి రథోత్సవంలో ఆదివారం అపశ్రుతి తలెత్తింది. తెల్లవారుజామున 2 గంటల సమయంలో వేలాది మంది భక్తులు కోలాహలంగా రథాన్ని లాగుతుండగా ఆంజనేయ స్వామి ఆలయానికి దగ్గరలో రథం కుప్పకూలింది. భక్తులు భయందోళనలతో హాహాకారాలు చేశారు. అప్రమత్తమైన పోలీసులు, గ్రామస్తులు ఎక్స్‌కవేటర్ సాయంతో రథాన్ని పైకి లేపారు. దాని కింద ఎవరూ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వంద సంవత్సరాల కిందట తయారు చేసిన రథం కావడం, వేలాది మంది భక్తులు భారీ ఎత్తున పూలహారాలను వేయడంతో ఆ బరువుకు తట్టుకోలేక రథానికి ఉన్న ఇనుప చువ్వలు ఊడిపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.




కూలిన రథం, విరుపడిన చక్రాలు, రథం



శివపార్వతులకు కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

కన్నులపండువగా శివపార్వతుల కల్యాణం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 25: పట్టణంలోని బసవన్నకట్ట వీధిలో వెలసిన పురాతన త్రిలింగేశ్వరాలయంలో మాఘమాసాన్ని పురస్కరించుకుని ఆదివారం శివపార్వతుల కల్యాణాన్ని కన్నుపండువగా నిర్వహించారు. వేదపండితులు రాఘవశర్మ, విజయ్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో ఆలయంలో మహన్యాసపూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, అభిషేకాలు, నూతన ఉత్సవ మూర్తులకు ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి పూజలు చేశారు. అనం ఆలయంలో ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించిన పెళ్లిపందిళ్ల వేసి ఉమా త్రిలింగేశ్వరుని కల్యాణోత్సవాన్ని జరిపించారు. కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తజనం హాజరై స్వామివార్లకు తలంబ్రాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మహామంగళిహారతిని తీసుకున్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా నల్లనమ్మ ఊరేగింపు

బుక్కపట్నం, ఫిబ్రవరి 25: మండలకేంద్రంలోని గ్రామ శివారులో వెలసిన నల్లనమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఘనంగా ఊరేగించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో పాలపొంగు ఉత్సవం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 25: మాఘమాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో పాలపొంగు ఉత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారజామునే మాఘస్నానాలు ఆచరించి కొత్త కుండలో నైవేద్యం చేసి పాలుపోసి పొంగులను నిర్వహించారు. అనంతరం నైవేద్యం తయారుచేసే కుండను ప్రత్యేకంగా పూజించి శ్రీమన్నారాయణకు మొక్కులు తీర్చుకున్నారు. పాలపొంగులు నిర్వహిస్తే కోరిన కోర్కెలు ఫలిస్తాయని, సంకల్పం సిద్ధిస్తుందని, సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. అనంతరం గ్రామస్థులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన భక్తి గీతాలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 25: సత్యసాయి భక్తులు భక్తిగీతాలతో అలరింపజేశారు. ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ మందిరంలో శ్రీసత్యసాయి భజన యూట్యూబ్ చానల్ 5వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. మొదట విద్యార్థులు వేదపఠనం చేశారు. అనంతరం సంగీత వాయిద్య గానాన్ని వినిపించారు. గంటపాటు మధురగాన వాయిద్యాలతో భక్తులను అలరింపజేశారు. సత్యసాయి యూట్యూబ్ చానల్ ద్వారా ప్రశాంతి నిలయంలో జరిగే కార్యక్రమాన్ని ప్రచారం చేస్తుంటారు. ఐదేళ్ల క్రితం యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించారు.

రాష్ట్ర పునర్నిర్మాణ సభను జయప్రదం చేయండి

ముదిగుబ్బ, ఫిబ్రవరి25: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అనంతపురంలో జరగనున్న రాష్ట్ర పునర్నిర్మాణ శంఖారావం సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ బాసినేని ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఏపీ అభివృద్ధిలో భాగంగా అనంతపురంలో పెద్ద ఎత్తున సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, ఏపీసీసీ అధ్యక్షులు షర్మిల, ఏఐసీసీ సభ్యులు రఘువీరారెడ్డి, కార్యక్రమానికి హాజరవుతున్నారన్నారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సభను జయప్రదం చేయాలన్నారు. ప్రకటన ఇచ్చిన వారిలో నిస్సార్ అహ్మద్, అనీల్, నాగరాజు యాదవ్, ఆదినారాయణ, చెవిటి వీరభద్ర పాల్గొన్నారు.

నల్లమాడ: అనంతపురంలో సోమవారం నిర్వహించనున్న రాష్ట్ర పునర్నిర్మాణ శంఖారావ సభను సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకుడు పఠాన్ గౌస్‌బాషా కోరారు. మండలంలోని కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

తాగునీటి కొళాయిల్లో మురుగునీరు

● ప్రజల ఆగ్రహం

ధర్మవరం, ఫిబ్రవరి 25: పట్టణంలోని సా యినగర్, సిద్దయ్యగుట్ట కాలనీలలో మున్సిపల్ కొళాయిల ద్వారా ము రికినీరు సరఫరా అవుతోంది. దీంతో స్థానికులు మున్సిపల్ అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఆదివారం సాయంత్రం ప్రతిరోజు లాగే కొళాయిల ద్వారా నీరు సరఫరా చేశారు. అయితే తాగునీటికి బదులు మురుగునీరు వచ్చాయి. వెంటనే మున్సిపల్ వాటర్‌మన్ ముత్యాలుకు కాలనీ వాసులు సమాచారం అందించారు. ఆయన వచ్చి కొళాయిల ద్వారా వచ్చిన మురుగునీటిని ఫొటోలు తీసుకుని వెళ్లాడన్నారు. కొళాయిల ద్వారా దుర్వాసనతో కూడిన నీరు వస్తే ఎలా తాగాలని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



కొళాయిల ద్వారా సరఫరా అయిన మురుగునీరు

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులకు గాయాలు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని దొరిగల్లు రోడ్ సమీపంలో లారీ, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో తండ్రీకొడుకులకు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. నాగులగుబ్బల గ్రామానికి చెందిన నరసింహుడు, తండ్రి నరసింహుడుతో కలిసి ద్విచక్రవాహనంలో ముదిగుబ్బకు వెళుతుండగా దొరిగల్లు రోడ్డులోని బ్రిడ్జి సమీపంలోకి రాగానే లారీ ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. వారిని స్థానికులు ఒక ప్రైవేట్ వాహనంలో ముదిగుబ్బ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థిని అదృశ్యం

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 25: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైంది. రూరల్ ఎస్ఐ యతిరాజులు ఆదివారం తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన విద్యార్థిని కదిరి పట్టణంలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోందన్నారు. ఈనెల 23న కాలేజీనుంచి ఇంటికి వచ్చిన తరువాత సాయంత్రం ఇంటినుంచి బయటకెళ్లి తిరిగిరాలేదన్నారు. స్నేహితులు, బంధువులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో విద్యార్థిని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో షబిఏబారాత్

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 25: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ముస్లింలు షబిఏబారాత్ వేడుకలను భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు. మండలకేంద్రంలోని జామీయా, మదీనా మసీదుల్లో మత పెద్దలు సిప్పాయితుల్లా, అల్లాబక్ష్ షబిఏబరాత్ విశిష్టతను వివరించారు.

వృద్ధాశ్రమానికి చేయూత

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 25: అమడగూరు మండలం గాజుపల్లిలో ఉన్న మాతృశ్రీ వృద్ధాశ్రమానికి టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు, మైనార్టీ నాయకుడు నిజాం ఆదివారం తనవంతు చేయూత నందించారు. నిజాం జన్మదినోత్సవం సందర్భంగా ఏడాదిపాటు హుండీలో పొగుచేసిన రూ.10 వేలను ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతికి అందచేసినట్లు చెప్పారు. టీఎన్ఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయులనాయుడు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలపై వైసీపీ గద్దల కళ్లు!

● గుట్టుచప్పుడు కాకుండా నాయకులకు పట్టాలు
● పట్టా నంబర్లు మార్చిన వైనం
● లబోదిబోమంటున్న లబ్ధిదారులు
● కీలకపాత్ర పోషించిన డీటీ, వీఆర్వో

కొత్తచెరువు, ఫిబ్రవరి 25: పేదల ఇళ్ల పట్టాలపై వైసీపీ గద్దల కళ్లుపడ్డాయి. ఇటీవల రెవెన్యూ అధికారులు కొంతమంది వైసీపీ నాయకులకు ఇళ్లపట్టాల మంజూరు చేసి గుట్టుచప్పుడు కాకుండా పంపిణీ చేయడం వివాదాస్పదంగా మారింది. ఓ నియోజకవర్గ ప్రజాప్రతినిధి సూచనలతో కొందరు రెవెన్యూ అధికారులు మండల కేంద్రానికి చెందిన ఒక వీఆర్వో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుని పట్టాలు పంపిణీ చేసినట్టు పలువురు అధికార పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. పేదోడికి సెంటు భూమి ఇవ్వాలంటే ఎక్కడా ప్రభుత్వ స్థలం లేదంటూ రెవెన్యూ అధికారులు నిక్కచ్చిగా చెబుతూ ఇలా గుట్టుచప్పుడు కాకుండా 22 మందికి ఇంటిస్థలాలు పంపిణీ చేయడం ప్రస్తుతం కొత్తచెరువులో చర్చనీయాంశంగా మారింది. మండల కేంద్రంలోని ఓ వైసీపీ నాయకుడు ఆ పట్టాలను అధికార పార్టీకి చెందిన నాయకులకు, కార్యకర్తలకు 27 సెంట్లు గుట్టుగా ఇవ్వడం అక్రమాలకు అద్దం పడుతోందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సర్వే నంబరు 384 లో 20 ఖాళీ ఇళ్లపట్టాలు ఉన్నట్టు తెలుస్తోంది. వాటిలో రెండు ఇళ్లపట్టాలను ఓ ప్రజాప్రతినిధి ఇంట్లో పనిచేసే వారికి ఇచ్చారని మిగిలిన 18 పట్టాలు ఆయన అధీనం లో ఉన్నాయనే విమర్శలున్నాయి. పార్టీకి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు ఇవ్వకుండా నిన్న మొన్న పార్టీలోకి వలస వచ్చిన వారికి పట్టాలు ఎలా ఇస్తారంటూ ఆ ప్రజాప్రతినిధి వద్ద ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.



గుట్టుగా 22 మందికి పట్టాలు సిద్ధం చేసిన జాబితా

ఇళ్ల పట్టా నంబర్లు మార్చి.. నాయకులకు పట్టాలు

మండల కేంద్రంలోని ధర్మవరం ప్రధాన రహదారి పక్కన సర్వే నంబరు 384లో తొలివిడతకింద 140 మందికి, రెండవ విడత 120 మందికి ఇళ్లపట్టాలను ప్రభుత్వం పంపిణీచేసింది. ఈ లేఔట్ ధర్మవరం ప్రధాన రహదారికి పక్కన ఉండటంతో వాటికి మంచి డిమాండ్ ఏర్పడింది. సెంటు రూ.3లక్షలు పలుకుతోంది. దీంతో కొందరు వైసీపీ నాయకులు అధికార దర్పంతో 12 మంది పేదలకు చెందిన ఇళ్లపట్టా నెంబర్లను మార్చి కార్యకర్తలకు ఇప్పించారన్న ఆరోపణలున్నాయి. దీంతోనిజమైన లబ్ధిదారులు లబోదిబో మంటూ తమ పట్టాలు వేరొకరికి ఎలా ఇస్తారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.

వైసీపీ నాయకులకు ఐదారు పట్టాలా?

అర్హులైన వారికి ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిదులు సభలు, సమావేశాల్లో చెప్పుకోవడం పరిపాటిగా మారింది. అయితే ఇంటిపట్టా ఇచ్చేవాడు మనవాడు అయితే ఒకటేమిటి రెండుమూడు పొందవచ్చన్నది మండల కేంద్రంలోని కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిరూపించారు. ఒకే ఇంటిలో భార్య, భర్త, తల్లి పేరు మీద పట్టాలు పొందారని అధికార పార్టీ నాయకులే చెప్పడం విశేషం.

వైసీపీ నాయకుల్లో ఆందోళన

పేదలకు ఆన్‌లైన్‌లో వచ్చిన ఇంటిపట్టా నెంబర్లను కొందరు వైసీపీ నాయకులు గతంలో పనిచేసిన డిప్యూటీ తహసీల్దార్ ద్వారా మార్చుకుని పట్టాలు పొందినట్టు సమాచారం. పట్టాలు పొందిన వారు పునాదులు వేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం ఆన్‌లైన్‌లో ఇంటిపట్టాలు పొందిన వారికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ప్రకటించింది. దీంతో ఇంటిపట్టాలను ఆన్‌లైన్‌లో కాకుండా మాన్యువల్‌గా పొందిననాయకులు ఆందోళన చెందుతున్నట్టు సమాచారం. కొందరు నాయకులు తమకు డబ్బులన్నా ఇవ్వండి లేకపోతే ఆన్‌లైన్‌లో పట్టాలన్నా ఇవ్వండి అంటూ బదిలీపై వెళ్లిన డిప్యూటీ తహసీల్దార్‌తో మంతనాలు చేస్తున్నట్టు సమాచారం.



ధర్మవరం రహదారిలో ఖాళీగా ఉన్న ప్లాట్లు

ఇంటిపట్టా నంబరు మార్చేశారు



ధర్మవరం రహదారి పక్కన 384 సర్వేనంబరులో ప్లాటు నంబరు 211 ఆన్‌లైన్‌లో నా భార్య పద్మజ పేరు మీద ఇంటిపట్టా మంజూరైంది. కొందరు అధికార పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారులు మీకు ఇంటిపట్టా రాలేదు. పెనుకొండ రహదారి పక్కన నల్లగుట్ట వద్ద సర్వేనెంబరు 483లో ప్లాటు నంబరు 78 వచ్చిందని మాన్యువల్ పట్టా ఇచ్చారు. మరో మహిళ జయమ్మకు 384 సర్వేనెంబరులో 203 ప్లాటు నెంబరు వచ్చింది. నా ప్లాటు నంబరు మార్చి కొండకింద ప్లాటు నంబరు 99 ఇచ్చారని ఆ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది.

- వెంకటేష్, కొత్తచెరువు

ఇంటి పట్టా ఇవ్వలేదు



మా నాన్నకు నలుగురు కొడుకులం. కొత్తచెరువులోనే పుట్టి పెరిగాం. తొలి నుంచి బాడుగ ఇంట్లో ఉన్నాం. ముఖ్యమంత్రి జగన్ ప్రతి పేదవాడికి సొంతింటికల సాకారం చేస్తానన్నారు. అయితే ఇప్పటి వరకు ఇంటి స్థలం కోసం ఐదాసార్లు నా భార్య వాణి పేరు మీదు దరఖాస్తుచేసుకున్నా. ఇంత వరకు పట్టా మంజూరు కాలేదు. అధికార పార్టీకి చెందిన నాయకులకు ఒక్కొక్కరికి రెండుమూడు పట్టాలు ఇచ్చారు.

- బ్రహ్మయ్య, కొత్తచెరువు

వైసీపీ పాలనకు ముగింపు పలికేందుకే వచ్చా

● నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్
● తుంపర్తిలో వైసీపీకి భారీ షాక్
● 40 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి25: ధర్మవరంలో వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలికి, టీడీపీ జెండా ఎగురవేయడానికి వచ్చానని, మీ అందరి ఆశీర్వాదంతో తప్పకుండా పసుపుజెండా ఎగురవేస్తానని నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ అన్నారు. ఆదివారం మండలంలోని తుంపర్తి గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 40కుటుంబాలు చేరాయి. కార్యక్రమానికి హాజరైన పరిటాలశ్రీరామ్‌కు గ్రామంలోకి వెళ్లగానే కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున పూలుచల్లుతూ ఘనస్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించి నీరాజనాలు పలికారు. అదేగ్రామానికి చెందిన ఆంజనేయులు, శ్రీరాములు, వెంకటరాముడు, గంగమ్మ, నాగలక్ష్మీలతో పాటు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి పరిటాలశ్రీరామ్ కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా భూసేకరణ చేస్తే ముందు బాధితులకు పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని, కానీ వారిని పట్టించుకోకుండా వారిపైనే దౌర్జన్యం చేస్తూ భూములు తీసుకోవడం మంచిది కాదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బాధిత రైతులందరికీ న్యాయం చేస్తామన్నారు. ధర్మవరంలో తాను రాజకీయాలు చేయడానికి రాలేదని, ఆరోజు పరిటాలరవీంద్ర ప్రజల గుండెల్లో ఏవిధంగా నిలిచారో అలా మంచి చేయడానికే వచ్చానన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ చిగిచెర్లఓబిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కుణుతూరు వేణుగోపాల్ రెడ్డి, మహేష్‌చౌదరి, మాజీ ఎంపీపీ మద్దిలేటి, కన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న, మాజీ జడ్పీటీసీ రామాంజనేయులు, గొట్లూ రు శ్రీనివాసులు, సర్పంచ్ ముత్యాలప్ప నాయుడు, విజయసారథి, రాఘవరెడ్డి, పాళ్యంవెంకటేష్, ఏగినాటి రమణ, భాస్కర్ చౌదరి, రాంపురంశీనా, నాగిరెడ్డి, చెన్నారెడ్డి, నారాయణస్వామి, శ్రీనివాసులు, గోవిందరెడ్డి, లక్ష్మీనారాయణ, పోతుకుంట రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్



పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించిన శ్రీరామ్

రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం: పల్లె



రోడ్‌షోలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

నల్లమాడ, ఫిబ్రవరి 25: రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని, జగన్‌కు వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడాలని రా కదిలిరా కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కురుమాల పంచాయతీ గంగాపురం, కురుమల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయాగ్రామాల్లో ఆయనకు యువత పెద్దఎత్తున బాణసంచా పేల్చుతూ, మహిళలు పువ్వులు చల్లుకుంటూ స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికెళ్లి టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గంలో రోడ్లు, వాటర్ ట్యాంక్‌లు టీడీపీ పాలనలో వేసినవేనని, వైసీపీ ప్రభుత్వం వాటికి మరమ్మతులు కూడా చేయలేదన్నారు. ఎమ్మెల్యే హంద్రీనీవా నీటినితో ఒక్క చెరువుకు కూడా నీరు ఇవ్వలేదన్నారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోమన్‌రెడ్డి ఆరాచకపాలకు చరమగీతం పాడాలన్నారు. ము ఖ్యమంత్రి అయినప్పటినుంచి రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి అరె స్టులు చేయడమే తప్ప, రాష్ట్రాభివృద్ధికానీ, నిరుపేదలకు సాయం చేయాలని జగన్‌కు లేదన్నారు. ప్రతిఒకరు జగనోహ్మన్‌రెడ్డి పాలనపై విసిగిపోయారని, ఎన్నికలు ఎప్పుడోస్తాయని, చంద్రబాబును ఎప్పుడు ముఖ్యమంత్రి చేసుకోవాలన్న ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. మన మందరం కలిసి కట్టుగా పనిచేస్తే సైకో జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపుతామన్నారు. మండల కన్వీనర్ మైలేశివశంకర్, బుట్టి నాగభూషణనాయుడు, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, కులశేఖర్‌నాయుడు, మణికుమారి, ప్రసాద్‌రెడ్డి ఈశ్వరయ్య, చిన్నబాషా, గంగప్ప, ప్రభాకర్, త్రిమూర్తి, పద్మనాభరెడ్డి, నాగరాజు, నాగభూషణరెడ్డి, నిజాంవలీ, సలీమ్‌బాషా, బాబు, అబ్దుల్‌సాబ్, విష్ణు, త్రిమూర్తి పాల్గొన్నారు.

వైసీపీనుంచి టీడీపీలోకి చేరిక

వైసీపీనుంచి నాలుగు కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఆదివారం కురుమాల ఎన్నికలప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. చారుపల్లి, రెడ్డివారిపల్లి గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు పి. రఘునాథ్‌రెడ్డి, పి. దివకర్‌రెడ్డి, వెంకటనారాయణ, బాబావలీ కుటుంబాల వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



టీడీపీలో చేరిన వారితో పల్లె

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా

తనకల్లు, ఫిబ్రవరి 25: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నివారణ సంస్థ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జనజాగృతి స్వచ్ఛంద సంస్థ వెంకటేష్ కళాజాతా బృందంతో హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఆదివారం తనకల్లులోని అంబేడ్కర్ సర్కిల్‌లో కళాబృందం హెచ్ఐవీ రాకుండా ఎలాంటిజాగ్రత్తలు తీసుకోవాలో పాటల రూపంలో వివరించారు. జనజాగృతి కదిరి ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసులు, ఓఆర్‌డబ్ల్యూ రమాదేవి, పీఈ భవానీ, అమ్మాజాన్, విహాన్‌కిషోర్, కళాబృందం సభ్యులున్నారు.

ఓబుళదేవరచెరువు: మండలకేంద్రంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం జిల్లా వైద్యశాఖ ఆదేశాల మేరకు జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై కళాజాత బృందం అవగాహన కల్పించారు. జనజాగృతి సంస్థ ఆర్‌ఓ డబ్ల్యూ శిల్ప, శ్రీవాణి, ప్రసన్న, లలితమ్మ, విజయ్, చైల్డ్‌ఫండ్ ఇండియా ప్రతినిధి యువరాజ్ పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై తనకల్లులో అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

మృత్యుతీగలు..!

● ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు
● చేతికందే ఎత్తులో తీగలు
● భయంభయంగా చిగిచెర్ల ప్రజలు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 25: మండలంలోని చిగిచెర్ల గ్రామంలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్‌తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీలో చేతికందే ఎత్తులో విద్యుత్‌తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. అదేవిధంగా ఆంజనేయస్వామి గుడివద్ద విద్యుత్ స్తంభం కిందభాగం పూర్తిగా దెబ్బతింది. ప్రధాన వీధిలో కూడా ట్రాన్స్‌పార్మర్‌కు సంబంధించి స్తంభం దెబ్బతింది. గ్రామంలో ఇలా స్తంభాలు, తీగలు వేలాడటంతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. గాలులు వీస్తే ప్రమాదాలకు గురికావాల్సిందేనని అటువైపు వెళ్లాలంటే గ్రామస్థులు భయపడుతున్నారు. సమస్యపై ట్రాన్స్‌కో అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. 16వ తేదీన ధర్మవరంలో జరిగిన విద్యుత్ సమస్యల పరిష్కారవేదికలో (ఫోరం)లో ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. అయినా విద్యుత్ అధికారుల్లో చలనం రాలేదని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చిగిచెర్ల ఎస్సీకాలనీలో చేతికందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు



ఆంజనేయస్వామి గుడివద్ద దెబ్బతిన్న విద్యుత్ స్తంభం

బంజారాలు సంఘటితమైతేనే రాజ్యాధికారం



పట్టణంలో ర్యాలీ చేస్తున్న బంజారా సంఘం నాయకులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 25: బంజారాలు సంగటితమైతేనే రాజ్యాధికారం సాధ్యమని ఆల్‌ఇండియా బంజార సంఘం నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో ఆల్‌ఇండియా బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జిల్లానుంచి అధిక సంఖ్యలో బంజారులు పాల్గొన్నారు. ముందుగా సమావేశ ప్రాంగణం నుంచి కాలేజీ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, పూలే సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ బంజారాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలన్నారు. ఏపార్టీ ప్రాధాన్యత కల్పిస్తుందో వారికే తమ మద్దతు ఉంటుందన్నారు. అనంతపురం జిల్లాలోని గుత్తిలో వెలసిన బంజారాల ఆరాధ్య దైవ్యం సేవాలాల్ ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించాలన్నారు. తిరుమలలో ఉన్న అభిరాం బాలాజీ మఠానికి బంజారాలచే కమిటీ ఏర్పాటుచేసి నిర్వహించాలన్నారు. బీసీ ఉపకులాలైన బోయ వాల్మీకి ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. బంజారాలు ఏకతాటిపైకి వచ్చి డిమాండ్ల సాధనకోసం పోరాడాలన్నారు. ఆసంఘం నాయకులు రాంశంకర్‌నాయక్, డిటీ నాయక్, రవీంద్రనాయక్, వెంకటరమణనాయక్, చక్రీనాయక్, అంజనేయులునాయక్, కాలేనాయక్, బాలాజీనాయక్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 25: మండలంలోని తంగేడుకుంట జడ్పీ పాఠశాలలో 16 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వవిద్యార్థులు ఒక్కటయ్యారు. తాము చదువుకున్న పాఠశాలలో కలిసి మెలిసి తిరిగిచదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆదివారం పాఠశాలలో 2007-08లో 10 చదివిన విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులు రాథ, అమృతవల్లి, రవికుమార్, రమేష్, కరుణాకర్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. అనంతరం అప్పటి గురువులు మాట్లాడుతూ 16 ఏళ్ల తరువాత గుర్తుగా విద్యార్థులందరూ కలవడం ఆనందంగా ఉందన్నారు. నిర్వహణ కమిటీ సభ్యులు జయచంద్ర, అశోక్‌కుమార్, అంజలి, రోహిత్, మునీరా, అశోక్, జయచంద్రబాబు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు సిద్ధం



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో ఆదివారం పట్టణప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రతింటికివెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. వారు మాట్లాడుతూ...వైసీపీ నాలుగున్నర ఏళ్లపాలనలో ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. రాష్ట్రంలో రామరాజ్యం రావాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌మాజీ చైర్మన్ బీరే గోపాలక్రిష్ణ, నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, అంబటిసనత్, రాళ్లపల్లి షరీఫ్, గోసాల శ్రీరాములు, అత్తర్ రహీంబాషా, కరెంటు ఆది, మారుతీస్వామి, మాధవరెడ్డి, కుళ్లాయప్ప, గంగారపు రవి, క్రిష్ణమూర్తి, తొగట అనిల్, వాసుదేవ, తెలుగుమహిళలు స్వర్ణకుమారి, మున్ని, భాను, ఇందిరా పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనతోనే సామాజిక మార్పు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 25: శాస్త్రీయ ఆలోచనతోనే సామాజిక మార్పు అని చిన్నపిల్లల వైద్యులు పీవీ మదన్‌కుమార్ పేర్కొన్నారు. జీవిత బీమా అభివృద్ధి అధికారి పిళ్లా కుమారస్వామి రచించిన శాస్త్రీయ ఆలోచన అనే పుస్తకాన్ని ఆదివారం ఎన్జీవో హోమ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాది నరసింహులు, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసులు, సుబ్బారెడ్డి హాజరయ్యారు. మదన్‌కుమార్ మాట్లాడుతూ ఈపుస్తకం ప్రజల్లో మూఢనమ్మకాలపై చైతన్యం చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం నాయకులు బయ్యప్ప, జ్ఞానవిజ్ఞావేదిక జిల్లా అధ్యక్షుడు ఆదిశేషు, పెన్షనర్ల సంఘం నాయకుడు వీరస్వామి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బందోబస్తు నడుమ గ్రూప్-2 పరీక్షలు



పురం బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న అభ్యర్థులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 25: రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన గ్రూప్ - 2 పరీక్షలు ఆదివారం పురంలో పటిష్ట బందోబస్తు నడుమ సజావుగా జరిగాయి. పట్టణంలోని ఎంజీఎం ప్రభుత్వ పాఠశాల, బాలయేసు జూనియర్, డిగ్రీ కళాశాలలు, సప్తగిరి, సప్తగిరి డిగ్రీ కలాశాలలు, బాలాజీ కళాశాల, ఎస్‌డీజీఎస్ కళాశాల, ఎల్‌ఆర్‌జీ నాయుడు జూనియర్ కళాశాల, బిట్ ఇంజనీరింగ్ కళాశాల, ఎన్ఎస్‌పీఆర్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మొత్తం 10 కేంద్రాలు కేటాయించారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష సమయం నిర్ణయించారు. నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతించరనే నిబంధన ఉండటంతో ఉదయం 9 గంటల కల్లా అభ్యర్థులు కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాల పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు నడుమ పరీక్షలు జరిగాయి. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పలు పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని సిబ్బందికి తెలిపారు.

బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు

గ్రూప్- 2 పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాల్సి ఉండేదని పరీక్షలకు హాజరైన అభ్యర్థులు, వారికి తోడు వచ్చిన తల్లితండ్రులు తదితరులు మాట్లాడుకోవడం విశేషం. ఆలస్యమైతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించరనే నిబంధనలు ఉండటంతో తెల్లవారే ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నామన్నారు. అయితే పరీక్ష కేంద్రాలకు బస్సులు ఎక్కువగా లేక పోవడంతో ఒక్కో బస్సులో వంద మంది దాకా ప్రయాణించినట్లు వారు తెలిపారు. వ్యయప్రయాసలతో నిలుచొని ప్రయాణంచాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. కొంత మంది అద్దె కార్లు తీసుకొని వెళ్లారు. అనవసరమైన సభలకు వందల కొద్దీ బస్సులు ఏర్పాటు చేస్తారు కానీ, నిరుద్యోగులు పరీక్షలు రాస్తుంటే బస్సులు ఏర్పాటు చేయలేరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెనుకొండ : స్థానిక సత్యసాయి డిగ్రీకళాశాలలో ఆదివారం నిర్వహించిన ఏపీపీఎస్ గ్రూప్-2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య సజావుగా ముగిసింది. ఈ పరీక్ష కేంద్రంలో మొత్తం 300మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 251మంది పరీక్షలకు హాజరయ్యారు. 49మంది గైర్హాజరైనట్లు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆదిశేషారెడ్డి తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాన్ని సబ్ కలెక్టర్ అపూర్వభరత్, జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు.

మడకశిరటౌన్: గ్రూప్-2 పరీక్షలు ఆదివారం మడకశిరలో సజావుగా సాగాయి. మడకశిర పట్టణంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 200 మంది అభ్యర్థులకుగాను 153 మంది హాజరుకాగా 47 మంది గైర్హాజరైనట్లు తహసీల్దార్ వెంకటేశు తెలిపారు. వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో 200 మంది విద్యార్థులకుగాను అక్కడ 47 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా సాగాయి. సబ్ కలెక్టర్ అపూర్వభరత్ తదితరులు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.



పురంలో ఎంజీఎం పాఠశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ మాధవరెడ్డి



మడకశిరలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్ అపూర్వభరత్

అందరికీ అందుబాటులో ఉంటా

టీడీపీ పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 25: 'ఇక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. ఏ సమస్య వచ్చినా అందరికీ అందుబాటులో ఉంటా' అని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ అభ్యర్థి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని కులాలకు చెందిన టీడీపీ నాయకులు పెద్దఎత్తున ఆమెను కలిసేందుకు తరలి వచ్చారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ ఎన్నికలకు సమయం తక్కువగా ఉందన్నారు. కావున టీడీపీ గతంలో చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని, వైసీపీ అరాచకాలను ఆయా నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. మరో రెండు రోజుల్లో కార్యాచరణ సిద్ధం చేసుకుని మారుమూల ప్రాంతంలోని ప్రతి ఇంటి నుంచి పట్టణంలోని ప్రతివీధిల్లో తిరుగుతానన్నారు. ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని తెలిపారు.

జనసైనికుల్లో నూతనోత్తేజం

పెనుకొండ టౌన్ : టీడీపీ, జనసేన పొత్తుతో అభ్యర్థులు ఖరారు చేయడంతో జనసేన కార్యకర్తల్లో నూతనుత్తేజం నెలకొందని జనసేన పట్టణ అధ్యక్షుడు లోకేష్ అన్నారు. పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థిగా కురుబ సవితను ఎంపిక చేయడంతో ఆదివారం టీడీపీ స్థానిక కార్యాలయంలో ఆమెను జనసేన కార్యకర్తలు, వీర మహిళలు పూలమాలలతో సన్మానించారు. అనంతరం జనసేన నాయకులు మాట్లాడుతూ... టీడీపీ అభ్యర్థి సవిత ఆధ్వర్యంలో నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న జనసేన సైనికులు కలిసికట్టుగా పనిచేసి ఆమె విజయానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పరిగి మండల కన్వీనర్ సురేష్, నాయకులు సుబ్రహ్మణ్యం, జుబేర్, వీరమహిళ శ్రీదేవి, బాబా ఫకృద్దీన్, రమేష్, పూలనరేంద్ర, అశోక్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కురుబ కులానికే తలమానికం సవిత

పెనుకొండ టౌన్ : కురుబ కులానికే టీడీపీ అభ్యర్థి సవిత తలమానికం అని కురుబ నాయకులు కొనియాడారు. కురుబ కులస్థులు ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి రామచంద్రారెడ్డి కుమార్తె సవిత కురుబ సమావేశాలు, విగ్రహాల ఏర్పాటు లాంటివి పెద్దఎత్తున చేపట్టారని, తండ్రి పేరుతో ఏర్పా టుచేసిన ట్రస్ట్ ద్వారా కులమతాలు తారతమ్యం లేకుండా ఎన్నో సేవా కార్యక్ర మాలు చేపట్టారని కొనియాడారు. ఏది ఏమైనా కురుబ కులస్థులంతా ఆమెకు అండగా ఉండటమేకాక, ఆమె భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు విస్తృత ప్రచారం చేస్తామన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసమే టీడీపీ, జనసేన పొత్తు

- వైసీపీ పాలనలో కాపులకు తీవ్ర అన్యాయం
- టీడీపీ మడకశిర అభ్యర్థి సునీల్‌కుమార్



ఇనగలూరు గ్రామస్థులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్, ఫిబ్రవరి 25: రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ, జనసేన పొత్తులతో సాగుతున్నాయని టీడీపీ మడకశిర నియోజకవర్గం అభ్యర్థి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో కాపులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై పేర్నినాని, అమర్‌నాథ్, అంబటి రాంబాబు ఎందుకు నోరు మెదపడంలేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కాపులకు అన్యాయం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కు తుందన్నారు. ఆయన ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరు ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రాజంపేట ఎంపీగా కాపులే పోటీ చేస్తున్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆ స్థానాన్ని మిథున్‌రెడ్డికి కేటాయించినప్పుడు వారెందుకు ప్రశ్నించలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచు కొని తెలుగుదేశం పార్టీలో విద్యావంతులకు, యువతకు ప్రాధాన్యమిస్తూ సీట్లు కేటాయించారన్నారు. ఇటీవల ప్రకటించిన 94 మంది అభ్యర్థుల్లో దళితులకు అత్యధిక ప్రాధాన్యం కల్పించి సామాజిక న్యాయం చేశారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినే త పవన్‌కల్యాణ్ రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని పొత్తులు పెట్టుకొన్నారని, రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతికి అడ్డు కట్ట వేసేందుకే వారు కలిసి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ అశ్వత్థరామప్ప, రైతుసంఘం నాయకుడు రాజగోపాల్, జనసేన నాయకుడు శివాజీ, టీడీపీ నాయకులు రామాంజనేయులు, ఈశ్వర్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎం చేద్దాం

అగళి : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకుందామని ఆ పార్టీ నియోజకవర్గం అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఇనగలూరులో ఆయన ఆదివారం కార్యకర్తలతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఇనగలూరులోని పలువురు సునీల్ సమక్షంలో టీడీపీ లో చేరారు. టీడీపీ మండల మాజీ కన్వీనర్ గోవిందప్ప, ఎస్సీసెల్ అధ్యక్షుడు, ఎంపీటీసీ నాగోజప్ప, గుండా నాగరాజు, వీరక్యాతప్ప, హనుమంతరాయ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ హత్య ?



నరసింహమూర్తి (ఫైల్)

హిందూపురం, ఫిబ్రవరి 25 : మండలంలోని నల్లూరుకు చెందిన నరసింహమూర్తి(46)అనే ఆటో డ్రైవర్ పరిగి మండలం కాలువపల్లి శివారు ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందా డు. నల్లూరుకు చెందిన నరసింహమూర్తి కొంత కాలంగా మహిళా కార్మికులను తన ఆటోలో పరిగి మండలంలోని నిషా గార్మెంట్స్‌కు తీసుకొచ్చి తీసుకెళ్లేవాడు. యథావిధిగా శనివారం కూడా మహిళా కార్మికులను తీసుకొచ్చాడు. సాయంత్రం వారిని తిరిగి నల్లూరుకు తీసుకెళ్లాడు. హిందూపురంలో పనుందని చెప్పి తిరిగి వచ్చాడు. అయితే ఆదివారం ఉదయం అటుగా వెళ్లేవారు కాలువపల్లి శివారు ప్రాంతంలో ఆటో, మృతదేహం ఉండటం చూశారు. కానీ ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడానికి భయపడి గ్రామంలోకి వచ్చి తెలుపగా... కొంతమంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరిగి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆనవాళ్లను బట్టి నల్లూరుకు చెందిన నరసింహమూర్తిగా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఇదిలా ఉంటే మృతుడి శరీరంపై ఆనవాళ్లను బట్టి వివాహేతర సంబంధం వల్లే ఈ సంఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

- ఎండుతున్న పంటలు
- లబోదిబోమంటున్న రైతులు



కల్లుమర్రిలో నీరందక ఎండుతున్న మొక్కజొన్న పంట

మడకశిర రూరల్, ఫిబ్రవరి 25: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను తొమ్మిది గంటల పాటు ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం కనీసం ఏడు గంటలు కూడా సక్రమంగా సర ఫరా చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నీరు సరిగా అందక సాగు చేసిన పంటలు కళ్లఎదుటే ఎండుతున్నాయని రైతులు లబోదిబోమంటున్నారు. మండలవ్యాప్తంగా 3,750 ఎకరాల్లో మొక్కజొన్న, వరి, రాగి, మిరప, మల్బరీ పంటలు సాగుచేశారు. నెల రోజులుగా వ్యవసాయబోర్లకు విద్యుత్ సక్రమంగా ఇవ్వకపోవడంతో సాగుచేసిన పంటలు ఎండుముఖం పడుతున్నాయి. ఈ విషయమై అనేకసార్లు విద్యుత్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యవసాయానికి తొమ్మిది గంటలపాటు సక్రమంగా విద్యుత్ అందించాలని కోరుతున్నారు.

ఐదు గంటలు కూడా ఇవ్వడంలేదు



వ్యవసాయానికి తొమ్మిది గంటల నిరంతరం విద్యు త్ ఇస్తామని ప్రభుత్వం, విద్యుత్ అధికారలు చెబుతు న్నారు. అచరణలో లేదు. మండలంలోని కల్లుమర్రి, మణూరు, ఆర్ అనంతపురం పంచాయతీల పరి ధిలో ఐదు గంటలు కూడా సక్రమంగా ఇవ్వడంలేదు. నేను రెండెకరాల్లో రూ.లక్ష ఖర్చుచేసి మొక్కజొన్న సాగుచేశా. విద్యుత్ సక్రమంగా సరఫరా కాకపోవడంతో పంట ఎండిపోతోంది. కల్లుమర్రి ఫీడర్‌లో ఉదయం 11 నుంచి 2 గంటల వరకు, మళ్లీ 4.30 నుంచి6.30 గంటల వరకు కేవలం ఐదు గంటలు సరఫరా చేస్తున్నారు. మణూర్ ఫీడర్‌లో తెల్లవారు జామున 4నుంచి ఉదయం 6.45 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30వరకు ఇస్తున్నారు. ఎక్కడ తొమ్మిది గంటలు ఇస్తున్నారు. ఇకనైనా అధికారులు సాగుచేసిన పంటలు ఎండకుండా విద్యుత్ సరఫరా చేయాలి. లేదంటే రైతులందరూ కలసి విద్యుత్ కార్యాలయం ముట్టడిస్తాం.

- రైతు నారాయణప్ప, కల్లుమర్రి

వేసవిలో విద్యుత్ డిమాండ్ బాగా పెరిగింది

వేసవిలో విద్యుత్ డిమాండ్ బాగా పెరిగింది. దీంతో వ్యవసాయబోర్లకు ఏడు గంటలు ఖచ్చితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. అయితే మండలంలో ఇటీవల కొన్ని విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టాం. ఈ కారణంగా విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం కలిగింది.

- మహేంద్ర, విద్యుత్ ఏఈ, మడకశిర

గిరి ప్రదక్షిణం.. సర్వపాపహరం



శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 25: గిరి ప్రదక్షిణతో సర్వపాపాలు నశిస్తాయని ఇతిహాసాలు తెలుపుతున్నాయని ఆలయ అర్చకుడు గోవిందశర్మ పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని ప్రసిద్ధ గుడ్డం రంగనాథస్వామి ఆలయం వద్ద ఆదివారం గిరి ప్రదక్షిణ నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి గిరి ప్రదక్షిణ గావించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. గోవింద నామ స్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. ఈ సందర్భంగా మూల విరాట్‌ను సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు.

సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు

రొద్దం, ఫిబ్రవరి 25 : మండలకేంద్రంలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రొద్దంలో పెన్నానది ఒడ్డున ఉన్న సత్యసాయి భజన మందిరంలో సాయి సత్యవ్రతాన్ని నిర్వహించారు. బాలవికాస్ పిల్లలు సత్యసాయి సేవాసమితి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

పెనుకొండ, ఫిబ్రవరి 25: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఘనగిరి పాఠశాలలో నిర్వహించిన మూర్ఛవ్యాధి చికిత్స శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో దాదాపు 30మంది వ్యాధిగ్రస్థులకు బెంగళూరు అక్షయ న్యూరో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఫిజీషియన్ శ్రీలేఖ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి హరి, జోన్ కార్యదర్శి ఇమ్రాన్, సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, బాబా, ఎంసీ బాబు, షౌకత్, మురళి, యశ్వంత్, ఘనగిరి పాఠశాల కరస్పాండెంట్ ఇలియాజ్ పాల్గొన్నారు.

పావగడ: బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి పావగడ హెల్త్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం వెంకటాపురంలో నిర్వహించిన కంటి శస్త్ర చికిత్సా శిబిరానికి మంచి స్పందన లభించింది. 122 మంది కంటి శస్త్ర చికిత్సలకు సంబంధించి ఈ శిబిరంలో పాల్గొనగా వారిలో 47మంది శస్త్ర చికిత్సకు ఎంపికకాగా వారిని బెంగళూరుకు తరలించారు. మంగళవారం వారికి కంటి శస్త్ర చికిత్స చేయిస్తామని హెల్త్ సొసైటీ అధ్యక్షుడు మానం శశికిరణ్ తెలియజేశారు. ఈసందర్భంగా కంటి వైద్యనిపుణులు డాక్టర్‌లు కవిత, పవిత్ర, మేనేజర్ హరీష్‌కుమార్, సాయిరెడ్డి, నరసింహనాయుడు, తదితరులు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



బాలుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

లేపాక్షి, ఫిబ్రవరి 25: మండలంలోని కంచిసముద్రం గ్రామంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో రెండేళ్ల బాలుడు మృతిచెందాడు. బాలుడి తల్లి నందిని తెలిపిన వివరాల మేరకు... కంచిసముద్రం గ్రామానికి చెందిన నరసింహ, నందిని దంపతుల కుమారుడు లోహిత్(2) ఇంటివద్ద ఆడుకుంటుండగా అటుగా వచ్చి న లారీ తగిలి కిందపడ్డాడు. వెంటనే వారు బాలుడిని లేపాక్షి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిరోదనలు మిన్నంటాయి. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో తల్లిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు లేపాక్షి పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో ఎరువులు, రాళ్ల, నీళ్ల తోలే వాహనాలు అధిక వేగంతో వెళ్తుంటాయని వాటిని కట్టడి చేయాలని మండల ప్రజలు తెలిపారు.

మరో సంఘటనలో యువకుడు...

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 25: మండలంలోని అమ్మవారిపల్లి వద్ద 44వ జాతీయరహదారిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రవీణ్‌కుమార్ (31)అనే యువకుడు మృతిచెందాడు. కియ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రంగడు తెలిపిన వివరాల మేరకు... బెంగళూరులోని కళ్యాణ్‌నగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ వెల్డర్‌గా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో వృత్తిపరంగా ప్రవీణ్ శుక్రవారం ద్విచక్రవాహనంలో బెంగళూరు నుంచి అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం పంపనూరుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి ద్విచక్రవాహనంలో బెంగళూరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో పెనుకొండ సమీపంలోని అమ్మవారిపల్లి వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి ముందు వెళ్తున్న మరో వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ అక్కడి కక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు కళ్యాణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తునట్లు కియా పోలీసులు తెలిపారు.

కల్తీ మద్యం తాగి వ్యక్తికి అస్వస్థత

గోరంట్ల, ఫిబ్రవరి 25: మండలంలోని బాచేన్నపల్లికి చెందిన మునిస్వామి కిక్ కోసం ఆదివారం కల్లుతో పాటు టెట్రా ప్యాకెట్ మద్యాన్ని కలిపి తాగాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కల్తీమద్యాన్ని బయట తాగి ఇంటికొచ్చాడు. ఇంటికి రాగానే కింద పడిపోవడం తో భార్య రుక్మిణమ్మ పరిశీలించింది. నోటినుంచి బురుగు రావడం, అపస్మారక స్థితిలో ఉండడంతో వెంటనే ఆటోలో గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ వినోద్ కుమార్ చికిత్సలు చేశారు. మద్యం ఊపిరితిత్తుల్లోకి చేరుకోవడంతో పరిస్థితి ఇబ్బంది కరంగా ఉన్నట్లుచెప్పారు. వెంటనే మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. దీంతో 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

దొంగకు దేహశుద్ధి

లేపాక్షి, ఫిబ్రవరి 25: మండల వ్యాప్తంగా తరచూ దొంగతనాలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. మండలలోని మామిడిమాకులపల్లిలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఒకడు ఓ ఇంట్లో జొరబడి దొంగతనానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి కేకలు వేయగా గ్రామస్థులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి లేపాక్షి పోలీసులకు అప్పజెప్పారు. స్థానిక పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. మండల వ్యాప్తంగా దొంగల హల్‌చల్ అధికమైందని పోలీసులు కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్థులు అంటున్నారు.

ముగిసిన మైలార లింగేశ్వరస్వామి ఉత్సవాలు



పుర వీధుల్లో ఊరేగుతున్న మైలార లింగేశ్వర స్వామి

అగళి, ఫిబ్రవరి 25 : మండలంలోని మధూడి గ్రామంలో వెలసిన మైలార లింగేశ్వరస్వామి వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. రెండు రోజులుగా జరిగిన ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. చివరి రోజు ఆదివారం ముఖ్య అతిథులుగా చిదానంద భారతి స్వాముల వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ భక్తికి మించిన శక్తి మరొకటి లేదని, భక్తితోనే మనిషికి మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. అదేవిధంగా గురువయ్యల పూజలు, పురవీధుల గుండా స్వామివారిని ఊరేగింపు, మహా మంగళహారతి అన్నదాన కర్యక్రమాలు నిర్వహించారు. మైలార లింగేశ్వరస్వామి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా కవితాయాత్ర



గగన్‌మహల్ వద్ద పుస్తక పరిచయ వేదిక నిర్వహిస్తున్న కవులు

పెనుకొండ, ఫిబ్రవరి 25: జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవ రాయల రెండో రాజధాని పెనుకొండలో నిర్వహించిన కవితాయాత్ర రాయల సాహితీ వైభవాన్ని తలపించింది. కవితా యాత్ర స్థానిక రాయల వేసవి విడిది గగన్‌మహల్, కొండపై నరసింహస్వామి దేవాలయ ప్రాంతం, మిట్ట ఆంజనేయ స్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువుల బాబు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. పెనుకొండలో ఘనంగా కవితాయాత్ర నిర్వహించడం హర్షణీయమన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 60మంది కవులు హాజరయ్యారు. శ్రీకృష్ణదేవరాయల సాహితీ వైభవాన్ని తలపించేలా కవులు, మతసామరస్యం అంశంపై కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారగ్రహీత డా.వేంపల్లి షరీఫ్, డా.సమీవుల్లా, సుమనాజయంతి, అంకె శ్రీనివాసులు, కొత్తపల్లి సురేష్‌బాబు పాల్గొన్నారు.

'విద్యార్థులు సేవాభావం అలవరచుకోవాలి'

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 25 : విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉపాధ్యాయుడు హరీష్‌బాబు సూచించారు. మండలంలోని రాంపురంలో ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని మూడోరోజు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా పాఠశాల పరిసర ప్రాంతాల్లో పెరిగిన చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రతా పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ కాంతారావు, వలంటీర్లు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల అపూర్వ కలయిక



ఒకేచోట కలిసిన విశ్రాంత ఉద్యోగులు

పెనుకొండ, ఫిబ్రవరి 25: పట్టణంలోని ఒకప్పటి ఆల్విన్ వాచ్ పరిశ్రమలో పనిచేసిన దాదాపు 60మంది విశ్రాంత ఉద్యోగులు, మహిళ ఆపరేటర్లు ఆదివారం స్థానిక నామారామయ్య ఫంక్షన్‌హాల్‌లో 25ఏళ్ల తరువాత ఒకేచోట కలిసి ఆప్యాయ పలకరింపుతోపాటు గత స్మృతులు నెమరవేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. ఆ పరిశ్రమ 25ఏళ్ల కిందట మూతబ డింది. అందులో పనిచేస్తున్న ఉద్యోగులు, మహిళా ఆపరేటర్లు వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా స్థానిక మహిళా ఆపరేటర్లు సుగుణమ్మ, అక్కమ్మ, తిరుమల, గౌరమ్మ, లక్ష్మీనరసమ్మ, రాజేశ్వరి, తిరుమల తదితరులు తమ స్నేహితుల చిరునామా తెలుసుకుని అందరిని ఒకచోట చేర్చారు. ఈ సందర్భంగా పరిశ్రమలో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులు గురుమూర్తి, పరమేశ్వరప్ప, సీతారామశాస్త్రి, నరసింహులు, రాజశేఖర్, రమామణిని పూలహారాలు వేసి శాలువలతో సత్కరించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

రొద్దం, ఫిబ్రవరి 25 : కేంద్ర ప్రభుత్వం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అమలుచేస్తున్న పథకాలపై బీజేపీ నాయకులు అవగాహన కల్పించారు. రొద్దంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా ఎస్సీకాలనీలో నీటి వసతి, రోడ్ల నిర్మాణం, ఉచిత బియ్యం, ఇళ్ల నిర్మాణం తదితర సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని బీజేపీని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహదేవ్, గంగాధరప్ప, మోహన్, పవన్, తిప్పేస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పరీక్షల్లో బ్రిలియన్స్ విద్యార్థుల ప్రతిభ

పెనుకొండ, ఫిబ్రవరి 25 : అనంతపురంలోని విశ్వం ఎడ్యుకేషనల్ టెక్నికల్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన వేదిక్ మ్యాథ్స్, అబాకస్ పోటీల్లో పాల్గొన్న స్థానిక బ్రిలియన్స్ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. వేదిక్ మ్యాథ్స్‌లో శివ రాంసింగ్, అబాకస్‌లో జాహ్నవి, జ్యోత్స్న విజేతగా నిలిచి బహుమతులు అందుకున్నట్లు కరస్పాండెంట్ నాగవేణి తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కాంగ్రెస్‌పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడి మృతి

గుడిబండ, ఫిబ్రవరి 25 : కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వరదరాజు(55) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. గుడిబండ మండలం రాళ్లపల్లికి చెందిన వరదరాజు మృతి విషయం తెలుసుకున్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వరదరాజు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను రఘువీరాతో పాటు మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మండల కన్వీనర్ నాగరాజు తదితరులు పరామర్శించారు.

రాజ్యాంగ చైతన్య రథయాత్రలో

తుమకూరుకు మొదటి స్థానం

పావగడ, ఫిబ్రవరి 25: వారం రోజుల నుంచి కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రాజ్యాంగ చైతన్యరథయాత్రకు సంబంధించి కర్ణాటకలోని 30 జిల్లాల్లో తుమకూరు జిల్లాకు మొదటి స్థానం లభించింది. జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రథయాత్ర కొనసాగి విజయవంతం చేసేందుకు కారకులైన ప్రతి సామాజిక వర్గానికి చెందిన నాయకులకు, అధికారులకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ శుభకల్యాణి, జిల్లా పంచాయతీ సీఎస్ ప్రభుగారికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ శుభకల్యాణి జిల్లా ప్రజలకు నాయకులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రీయ ఐక్యత సమావేశానికి తరలివెళ్లిన బస్సులు

పావగడ, ఫిబ్రవరి 25: రాజ్యాంగ చైతన్య రథయాత్రలో తుమకూరు జిల్లా మొదటి స్థానంలో నిల్వడంతో బెంగళూరులో నిర్వహించిన రాష్ట్రీయ ఐక్యతా సమావేశానికి పావగడ నుంచి 34 బస్సులు ఆదివారం తరలివెళ్లాయి. ప్రతి పంచాయతీ నుంచి ఒక బస్సు చొప్పున 34 గ్రామ పంచాయతీల నుంచి బస్సుల్లో జనం తరలివెళ్లారు. అయితే కొన్ని పంచాయతీలలో అధికారుల నిర్లక్ష్యం వల్ల సరైన సమాచారం అందించకపోవడంతో కొంత మందిమాత్రమే తరలివెళ్లారు.